తిరుమల పవిత్రతను దెబ్బ తీస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ శ్రీ వైష్ణవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రాచార్య

బాలానగర్, సెప్టెంబర్ 20: తిరుమల పవిత్రతను దెబ్బ తీస్తున్న వారిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ శ్రీ వైష్ణవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి నరేంద్రాచార్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో నెయ్యికి బదులుగా జంతు, చేప, కలేభరాలు, కొవ్వుతో తయారు చేసిన నెయ్యిని వాడి లడ్డూ పవిత్రతను, హిందువుల మనోభావాలను దెబ్బ తీయడం బాధాకరన్నారు. తిరుమలలో అన్య మతస్తులను ఉద్యోగాల్లో నియమించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే ఎవరైనా అన్య మతస్తులు ఉద్యోగులు ఉంటే వారిని తక్షణమే తొలగించాలని కోరారు. తిరుమల అంటే పవిత్రతకు మారుపేరు అన్నారు. తిరుమల ఆలయానికి మచ్చ తెచ్చే ఏ కార్యమైనా క్షమించరాని నేరంగా పరిగణించాలని సూచించారు.

ప్రేమ విఫలమై.. వ్యక్తి ఆత్మహత్య

సాయిగణేశ్(ఫైల్)

అల్లాపూర్, సెప్టెంబర్ 20:ప్రేమ విఫలమై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ మత్తు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడియాల గ్రామానికి చెందిన మల్లయ్య, కనకమ్మ దంపతుల కుమారుడు సాయి గణేశ్(24) కూకట్‌పల్లి పరిధి బాగ్‌అమీర్‌లో తన మిత్రుడు అరుణ్ తో కలిసి నివాసం ఉంటున్నాడు. ఉప్పల్‌లోని సీసీ కెమెరాల ఆఫీసులో పని చేస్తున్నాడు. తన దగ్గర బంధువుల అమ్మాయితో కొన్నిరోజుల నుంచి ప్రేమలో ఉన్నాడు. అది కాస్తా విఫలమవ్వడంతో మస్థాపానికి గురై గురువారం రాత్రి నువ్వు లేని జీవితం వ్యర్థం అని ఉత్తరం రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది.. యువతి ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 20 : జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నాగోల్‌కు చెందిన ఆకుల స్నేహ (34) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ... కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డులోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో నివాసం ఉంటుంది. ఆమెకు గతంలో రెండు సార్లు వివాహం కాగా, వారితో విడిపోయి ఒంటరిగా జీవిస్తున్నది. కాగా, శుక్రవారం ఉదయం తాను నివసిస్తున్న హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది.జీవితంపై విరక్తిచెంది తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తండ్రి ఆకుల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాపూర్, సెప్టెంబర్ 20: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అల్లాపూర్ డివిజన్ బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ శశి భూషన్ ప్రజలకు సూచించారు. శుక్రవారం మోతీనగర్ పరిధి బాలాజీ స్వర్ణపురికాలనీలోని బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ ఆవరణలో అపోలో హాస్పటల్స్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్, విజయేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 20 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 37, వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 26, బజ్జి మిర్చి 70, కాకరకాయ 50, బీరకాయ 50, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 45, కాలీఫ్లవర్ 23, దొండ 45, చిక్కుడు 85, గోరుచిక్కుడు 50, బీట్‌రూట్ 28, క్యాప్సికం 70, ఆలుగడ్డ 38, కీరా 33, దోసకాయ 23, సొరకాయ 19, వెల్లుల్లి 380, చింతపండు 140, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

గాజులరామారం సర్కిల్‌లో ఆగని కీచకపర్వం!

- గతంలో శానిటేషన్ సూపర్‌వైజర్
- తాజాగా ఓ సెక్షన్ అధికారి..?

సర్కిల్‌లో ఓ సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి తనను లైంగికంగా వాడుకుని వదిలివేస్తున్నాడంటూ శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఓ మహిళ సదరు అధికారి పని చేసే ఛాంబర్‌లోకి వెళ్లి గొడవకు దిగింది. ఆగ్రహంతో ఆ సెక్షన్ అధికారిని చెప్పుతో కొట్టిందని, అయితే ఇద్దరి మధ్యన చాలా సేపు వాగ్వివాదం జరిగిందని ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని మీడియాకు తెలియజేస్తానని మహిళ చెప్పడంతో భయాందోళనలకు గురైన సదరు అధికారి ఆ మహిళను హడావిడిగా తన స్కూటీపై బయటకు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయం ఆ నోటా...ఈ నోటా బయటకు పొక్కడంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం. సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఈ వార్త వాస్తవమా? వదంతులా? అని తేల్చాల్సిన ఉన్నతాధికారులు ఏం జరగలేదంటూ గప్‌చుప్‌గా వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. ఇదే విషయమై గాజులరామారం డీసీ మల్లారెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన మీడియాపై చిర్రుబుర్రులాడారు. అన్ని మీకు చెప్పాలా..? ఏం రాసుకుంటారో.. రాసుకోండంటూ ఫోన్‌కట్ చేయడం గమనార్హం. కాగా, సర్కిల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఉన్నా అవి పని చేయకపోవడం, కిందిస్థాయి అధికారులపై సర్కిల్ ముఖ్య అధికారికి పట్టులేదనే ఆరోపణలు వస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కూకట్‌పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాధవరం రంగారావులతోపాటు శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా. *– కొండాపూర్, సెప్టెంబర్ 20*

చేపలు వదలడంతో జీవవైవిధ్యం పెంపొందుతుంది

బోటానికల్ గార్డెన్ చెరువులో చేపలు వదులుతున్న అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు

కొండాపూర్, సెప్టెంబర్ 20 : పార్కుల్లోని చెరువులు, కుంటలలో చేపలు వదలడం ద్వారా ఎన్నో రకాల పక్షులు ఆయా పరిసరాల్లో ఆవాసాలను ఏర్పర్చుకోవడంతో జీవవైవిధ్యం పెంపొందుతుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీ.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లోని బోటింగ్ పాండ్, నైట్ సఫారీ చెరువు, పాలపిట్ట సైక్లింగ్ పార్కు చెరువు, ఫారెస్ట్ ట్రెక్ పార్కులోని పెద్ద చెరువు, చిన్న చెరువులలో చేప పిల్లలను వదిలినట్లు ఆయన తెలిపారు. గతంలో సైతం ఆయా చెరువులలో చేప పిల్లలను విడిచిపెట్టడం ద్వారా ఎన్నో రకాల పక్షులు ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ డాక్టర్ జీ స్కైలాబ్, ప్లాంటేషన్ మేనేజర్ వేమి రెడ్డి లక్ష్మారెడ్డి, ఎఫ్ఆర్ఓ సామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన

ఉర్దూ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కొండాపూర్, సెప్టెంబర్ 20 : గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు రెండవ రోజు ఆందోళనను కొనసాగించారు. వర్సిటీ మెస్‌లలో నాణ్యతలేని ఆహారం వడ్డిస్తున్నారని, ప్రశ్నించిన విద్యార్థుల మీద వర్సిటీ యాజమాన్యం దురుసుగా ప్రవర్తిస్తుందని వాపోతూ ఆందోళన చేశారు. విద్యార్థుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న వర్సిటీ ప్రొక్టర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టగా, వర్సిటీ యాజమాన్యం ప్రొక్టర్‌ను విధుల నుంచి తప్పించింది. కాగా, వర్సిటీ మెస్‌లో అపరిశుభ్రత రాజ్యమేలుతుందని, మెస్‌లో వడ్డిస్తున్న ఆహారం నాణ్యతలేకుండా, దుర్వాసన వస్తుందని వాపోతూ శుక్రవారం ఆందోళనను కొనసాగించారు. విద్యార్థులు వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు తల్హా మన్నన్ మాట్లాడుతూ.. వర్సిటీలో చదువుతున్న విద్యార్థులు అరకొర వసతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై వర్సిటీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని, నిరాహారదీక్ష చేపడుతామని హెచ్చరించారు. విద్యార్థుల ఆందోళనతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు బయటి వ్యక్తులు లోపలికి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లిలో రూ. 50లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డివిజన్ అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా డివిజన్ వాసులకు సూచించారు. ప్రజల సంక్షేమం, డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. *– కొండాపూర్, సెప్టెంబర్ 20*

కాలనీల్లో సౌకర్యవంతమైన రహదారులు

మియాపూర్, సెప్టెంబర్ 20: డివిజన్ పరిధిలోని కాలనీల్లో అత్యంత సౌకర్యవంతమైన అంతర్గత రహదారులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని బీకే ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ శ్రీకాంత్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. అధికారులు పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని జాప్యానికి అవకాశం లేకుండా చూడాలని శ్రీకాంత్ పేర్కొన్నారు.

– డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. పారిశుద్ధ్య, ఎంటమాలజీ విభాగాల అధికారులతో కార్పొరేటర్ శ్రీకాంత్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నివాస ఆవాసాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని, దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, మహేశ్, ఏఈ గణేశ్, రాజేశ్, బాలగౌడ్, వినయ్, మహేశ్, నాగరాజు, ఆగమయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో నిరు పేదలకు చేయూత

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు నర్సింహయాదవ్, రవీందర్‌రెడ్డి, సతీశ్‌గౌడ్, మహేశ్వరి

బాలానగర్, సెప్టెంబర్ 20 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో నీరు పేదలకు చేయూత అందుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కృష్ణారావుతో పాటు కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, మహేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, బేగంపేట డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు 42 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డీటీ శ్రీదేవితో కలిసి వారు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు ఎంతగానో దోహదపడుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు సహకారం అందించాలనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత 1,116తో పాటు తులం బంగారం అదనంగా ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు తులం బంగారం పథకాన్ని అమలు చేయడంలో విఫలం చెందారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కర్రె జంగయ్య, మందడి సుధాకర్‌రెడ్డి, ఇర్ఫాన్, డి. శాఖయ్య, ఎండీ కాజా, సుధర్శన్‌రెడ్డి, ఎన్వీ రత్నం, సుధాకర్ రెడ్డి, సురేందర్‌నాయుడు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేయాలి

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ సత్యనారాయణరావు,వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు

దుండిగల్, సెప్టెంబర్ 20 : తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో భద్రపర్చాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో శుక్రవారం వైస్ చైర్మన్ తుడుము పద్మారావుతో కలిసి కమిషనర్ కె.సత్యనారాయణరావు ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తడి, పొడిచెత్త వేరు చేసి ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోకి ఇవ్వాలని మహిళలకు తెలియజేశారు. గార్బేజ్ వనరబుల్ పాయింట్స్ గుర్తించి చెత్త కుప్పలను శుభ్రం చేయించారు. చికెన్, మటన్ షాపుల వద్ద ప్లాస్టిక్ కవర్లు వాడకుండా తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేర్వేరు చేసి మున్సిపల్ పర్మిషన్ ఇచ్చిన ఏజెన్సీల వారికే ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఈ.సాత్విక్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, అంజయ్య, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను వినియోగించుకోవాలి

ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ మొగులమ్మ బస్తీలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డు ఈ కేవైసీ కేంద్రాన్ని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రంలో నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కార్పొరేటర్ వెంకటేశ్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పరిమితిని ప్రభుత్వం పెంచిందని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. *– మియాపూర్, సెప్టెంబర్ 20*

'సీబీఎస్ఈ' ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు ప్రదానం

వేడుకల్లో పాల్గొన్న హెచ్ఎస్ఎస్సీ ప్రతినిధులు

దుండిగల్, సెప్టెంబర్ 20 :సమాజంలో సానుకూల మార్పును పెంపొందించడంలో అధ్యాపకులదే ప్రముఖపాత్ర అని చైల్డ్ రైట్ అండ్ యూ(సీఆర్‌వై) జనరల్ మేనేజర్ అనుపమ ముహూరి, అంతర్జాతీయ కీనోట్ స్పీకర్, పాజిటివ్ సైకలాజిస్ట్ డా.కవిత అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌లోని క్రీక్‌ఫ్లానెట్ స్కూల్, వీనస్ క్యాంపస్‌లో గురువారం హైదరాబాద్ నవోదయ స్కూల్ కాంప్లెక్స్(హెచ్ఎస్ఎస్సీ) ఆధ్వర్యంలో 'ఎథీనా అరిస్టీయా-ఇన్‌స్పైర్డ్ టీచర్స్ అవార్డ్స్-2024' పేరిట ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అనుపమ మహూరి, డా.కవిత ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రదానోపన్యాసం చేశారు. 8 జిల్లాలకు చెందిన 350 సీబీఎస్ఈ ఎఫిలియేటెడ్ స్కూల్స్ నుంచి మొత్తం 200 మంది అధ్యాపకులకు ఇన్‌స్పైర్డ్ టీచర్స్ అవార్డులను అందజేశారు. అంతకు ముందు క్రీక్ ఫ్లానెట్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎస్ఎస్సీ చైర్‌పర్సన్, అభయ పాఠశాల ప్రిన్సిపాల్ అమీర్‌ఖాన్, వైస్ చైర్మన్ పర్సన్స్ డా.బి.ఎబ్నేజర్, మెరిడీయన్ స్కూల్ ప్రిన్సిపల్ రోజాపాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్, క్రీక్‌ఫ్లానెట్ స్కూల్ ప్రిన్సిపల్ సుజాత నాయుడు, బాబర్‌అలీ, గౌడీయం స్కూల్ ప్రిన్సిపల్ సుధేష్ణా ఘటర్జీతో పాటు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ స్థాయి ఖోఖో క్రీడా పోటీలు

బాలానగర్, సెప్టెంబర్ 20: ఎన్ఎస్‌కేకే హైస్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు నేటితో ముగిశాయి. శుక్రవారం ఎన్ఎస్‌కేకే హైస్కూల్‌లో నిర్వహించిన కూకట్‌పల్లి, బాలానగర్ జోనల్‌స్థాయి ఖోఖో క్రీడాపోటీల్లో 40 టీమ్‌లు పోటీలో తలపడ్డాయి. ఈ పోటీల్లో కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభకు పదునుపెట్టారు. కాగా, మహాత్మాజ్యోతిరావు పూలే పాఠశాల అండర్ -17 ఇయర్స్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకోగా, అండర్-14 ఇయర్స్ విభాగంలో గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో అండర్-14, 17 ఇయర్స్ విద్యార్థులు ఖోఖో క్రీడా పోటీల్లో తమ ప్రతిభను కనబరిచారు.

అండర్-17 విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న మహాత్మాజ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులు

గణనాథుడి పూజలో ఏసీసీలు

కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాప్‌లో గణనాథుడి మండపం వద్ద కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, కేపీహెచ్‌బీ కాలనీ సీఐ వెంకటేశ్వర్‌రావు, కూకట్‌పల్లి ఏసీపీ ముత్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, మమత దంపతులు, రాజేశ్‌గౌడ్, అరవింద్‌రెడ్డి, సంజీవరావు, మేకలమైకల్, రేష్మా,రాజు తదితరులు ఉన్నారు. *– కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 20*

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాదాపూర్, సెప్టెంబర్ 20: ఫీడర్ మరమ్మతుల కారణంగా హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఇంద్రసేనారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీ ఆదిత్యా నగర్ ఫీడర్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, ఆదిత్యా నగర్, హనుమాన్ టెంపుల్ ఏరియా, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో ఉదయం 11:30 గంటల నుండి మద్యాహ్నం 1 గంటల వరకు, 11 కేవీ మాదవనగర్ ఫీడర్ పరిధిలోని మాతృశ్రీ నగర్ పార్ట్, ఎస్‌బిఐ బ్యాంక్ ఏరియా, మాదవ నగర్ పార్ట్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 11:30 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలగనున్నట్లు ఆయన తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీలో...

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 20 : కూకట్‌పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దేవినగర్, గాయత్రినగర్, జెనెసెస్ స్కూల్ పరిసర ప్రాంతాలలో...ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు వివేకనందనగర్ వెంకటేశ్వరస్వామి టెంపుల్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అత్యున్నతస్థాయి వైద్యం అందించాలన్నదే కిమ్స్ లక్ష్యం

కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కిమ్స్ హాస్పిటల్ సీఎండీ, డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు

మాదాపూర్, సెప్టెంబర్ 20:అత్యుత్తమ సాంకేతిక సాయంతో రోగులకు అత్యున్నత స్థాయి వైద్యం అందించాలన్నదే కిమ్స్ దవాఖాన వైద్యుల లక్ష్యమని కిమ్స్ హాస్పిటల్ సీఎండీ, డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు అన్నారు. కొరియాకు చెందిన అత్యాధునిక క్యువిస్ జాయింట్ రోబోటిక్ సిస్టమ్ సాయంతో మోకాలి ఆస్టియోఆర్థరైటిస్ సమస్యలతో ఇబ్బందులు పడే రోగులకు ఏర్పాటు చేసిన పుల్లీ ఆటోమేటెడ్ రోబోటిక్ సిస్టమ్‌తో ఇప్పటి వరకు 300 మందికిపైగా రోగులకు మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు చేయడంతో శుక్రవారం కొండాపూర్‌లోని కిమ్స్ దవాఖానలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కిమ్స్ హాస్పిటల్ సీఎండీ, డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు విచ్చేసి కిమ్స్ హాస్పిటల్ సీఈఓ, డాక్టర్ అభినయ్ బొల్లినేనితోపాటు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, డాక్టర్ అన్నెసాయి లక్ష్మణ్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యుత్తమ సాంకేతిక సాయంతో రోగులకు అత్యున్నతస్థాయి వైద్యం అందించాలన్నదే కిమ్స్ దవాఖాన వైద్యుల లక్ష్యమన్నారు. విజయవంతంగా 300 మంది రోగులకు రోబోటిక్ మోకాలి శస్త్ర చికిత్సలు చేయడం కిమ్స్